www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 21 | మార్చి | 2025
పేజీలు 8

## నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు



-జిల్లాలో 97 పరీక్షా కేంద్రాలు
-హాజరుకానున్న 16,788 మంది విద్యార్థులు
-ఈ ఏడాది అడిషనల్స్‌కు బదులు బుక్‌లెట్

2లో

# పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం




-వ్యవసాయ రంగాలపై కార్పోరేట్ల కన్ను
-జై కిసాన్ జై జవాన్ స్థానే జై ఆదానీ జై అంబానీ
-మోడీ హామీలు నీటి మూటలే..
-రైతుసంఘం మహాసభలను ప్రారంభించిన బాగం











ప్రజాపక్షం/ఖమ్మం : పోరాటాల ద్వారానే రైతాంగ, వ్యవసాయరంగ సమస్యలు పరిష్కారమవుతాయని పోరాటాలు లేకుండా పరిష్కారం కావని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు బాగం హేమంతురావు తెలిపారు. వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయరంగం సంక్షోబం వీడదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా 21వ మహాసభ గురువారం స్థానిక కమ్మవారి కళ్యాణమండపంలో జరిగాయి. మహాసభలు ప్రారంబం సూచికగా రైతుసంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాన్ని బాగం హేమంతురావు ఆరిష్కరించారు, ఫోటో ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంబించారు. దొండపాటి రమేష్,పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బాణోత్ రవి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభలో హేమంతురావు మాట్లాడుతు మునుపెన్నడు లేని

మిగతా 2లో..

## ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



-కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన
-ధాన్యం కొనుగోలుకు 344 కేంద్రాల ఏర్పాటు
-రబీ ధాన్యం కొనుగోలుపై సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఖమ్మంజిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి

మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో 30 మంది మావోయిస్టులు హతం

-ఎదురుకాల్పుల్లో డిఆర్‌జి జవాన్ మృతి
-బలగాలకు అమిత్ షా కితాబు

వివరాలు.. 7లో



## 25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల
# నిర్మాణమే లక్ష్యం





-ఉగాది నుండి మహిళలకు సన్నబియ్యం
-మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/పెనుబల్లి: ఉగాది పర్వదినం రోజు నుండి రాష్ట్రంలోని ప్రతి రేషన్ కార్డు మహిళలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ గృహ సముదాయానికి ఆయన శంకుస్థాపన, భూమి పూజ చేశారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఈ గ్రామంలోని 28 ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలోని డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు.

మంత్రి రాకతో రామచంద్రాపురం

మిగతా 2లో..

# పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం







**(మొదటిపేజీ తరువాయి)**

రీతిలో భారతదేశ వ్యవసాయరంగం సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర్య భారత దేశంలో రైతుఆత్మహత్యలు ఆగడంలేదని అన్నారు. తొలినాళ్లలో వ్యవసాయరంగానికి ఇచ్చినప్పటికి రానురాను ప్రాధాన్యత తగ్గించారని మోడి పాలనలో సాగుపట్ల నిర్లక్ష్యంతోపాటు మొత్తం వ్యవసాయరంగాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. 18 శాతం జిడిపి గల వ్యవసాయరంగంపై కార్పోరేట్ల కన్నుపడిందని హేమంతురావు ఆరోపించారు. లాల్‌బహుదూర్ శాస్త్రి జైజవాన్‌జైకిసాన్ నినాదం ఇస్తే ఇప్పటి పాలకులు జై ఆదాని జై అం బాని అని అంటున్నారని అన్నారు. 765 మంది రైతులు బలిదానం తర్వాత నల్లచట్టాల అమలుపై వెనుకడుగు వేసిన మోడి దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర్య దేశంలో ఇప్పటివరకు కేవలం 36 శాతం భూమికి మాత్రమే సాగునీరు అందిస్తున్నారని 64 శాతం భూముల్లో సాగు వర్షాధారణ ద్వారానే సాగుతుందని అన్నారు. కమ్యూనిస్టులు పోరాట ఫలింగానే బ్యాంకులు జాతీయ కరణ జరిగిందని అవే బ్యాంకులు ఇప్పుడు రైతులకు రుణాలు ఇవ్వకపోగా కార్పోరేట్ల సేవలో బ్యాంకులు మునిగి తేలుతున్నాయని అన్నారు. 16.50 లక్షల కోట్ల రూపాయలు కార్పోరేట్ లకు రుణాలను రద్దు చేశారని రైతురుణాలు రద్దు కోరితే ఈ ప్రభుత్వం కనీసం స్పందించడంలేదన్నారు. స్వామినాధన్ సిఫారసు అమలు చేయాలని రైతుసంఘం అనేక పోరాటాలు నిర్వహించిందని హేమంతురావు తెలిపారు. గిట్టుబాటు ధరలు వ్యవసాయ ఉత్పత్తులక సంబందించి పెట్టుబడికి 50 శాతం మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వందరోజుల్లో రైతులుకు ఇచ్చిన హామీలను అమలుచేస్తామని పదేళ్లు గడిచిన ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సాగుగిట్టుబాటు కాక రైతులు అసంఘటిత కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని రెట్టింపుచేస్తామని చెప్పిన మోడి సర్కార్ కనీస చర్యలు చేపట్టలేదని అన్నారు. రైతులు ఆదాయం నెలకు రూ 10,125లు మాత్రమే అన్నారు. మోడి పంటల భీమాను అమలు చేస్తే కార్పోరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రమే లాభపడ్డాయన్నారు. మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీలకు 62 వేల కోట్ల రూపాయలు లాభాలు రాగా అంబానీ కంపెనీకే 11 వేల కోట్ల రూపాయలు లాభలు వచ్చిందన్నారు. ప్రపంచంలోనే ఆహార ఇతర ఉత్పత్తులకు సంబందించి ప్రధమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నా ఉత్పాదక శాతాన్ని పరిశీలిస్తే మిగిలిన దేశాలకంటే తక్కువగా ఉందని అన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు లేకపోవడం పరిశోధనలు జరగకపోవడమే దిగుబడులు తగ్గేందుకు కారణమని హెమంతురావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడిచినా వ్యవసాయరంగం సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సాగునీటి ప్రాజెక్కులు పూర్తి కాలేదన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం కాలేశ్వరం గానే మిగిలిందన్నారు.సిపిఐ పోరాట ఫలితంగా దుమ్ముగూడెం ప్రారంబం అయితే ఇప్పుడు ఆపేర్లు మార్చి తీవ్ర జాప్యం చేస్తున్నారని హేమంతురావు ఆరోపించారు. సీదారామ ప్రాజెక్టు వ్యవం పెరుగుతుందే తప్ప ప్రాజెక్టు పూర్తి కావడంలేదన్నారు. ప్రజల సొమ్ము గుత్తేదారుల పాలు అవుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫి రైతు భరోసా అమలులో పూర్తిగా వైఫల్యం అయిందని హేమంతురావు ఆరోపించారు. ధ్యాన్యానికి బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని అన్నారు. రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. చైతైన్యం కలిగిన తెలంగాణ రైతాంగం సమరశీల పోరాటాలకు సిద్దం కావాలన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ రాష్ట్ర కంట్రోల కమీషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సిపిఐ రైతుసంఘం నాయకులు యర్రా బాబు, మెడికంటి వెంకటరెడ్డి, ఏపూరి లతాదేవి, సింగు నర్సింహారావు, జాగర్లముడి రంజిత్, యామాల గోపాలరావు, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాణోత్ రామ్‌కోటి, అమరనేని వీరభద్రరావు, మందడపు రాణి, పోటు కళావతి, బెజవాడ రవి, పగడాల మల్లేశ్, ఏలూరి భాస్కర్‌రావు, బాగం ప్రసాద్, కూచుపూడి రవిప్రసాద్, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం



**(మొదటిపేజీ తరువాయి)**

గ్రామ కాంగ్రెస్ నాయకులు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, మేళ తాళాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన ఇండ్లు తప్ప బీఆర్‌ఎస్ పది సంవత్సరాల కాలంలో పేదలకు ఇళ్ళు రానివ్వలేదని నేడు మరలా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు 5 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వచ్చే 3 సంవత్సరాల కాలంలో 25 లక్షల ఇండ్లు నిర్మించడమే లక్ష్యం అని అన్నారు. చదువుకున్న యువత కోసం రాజీవ్ యువ వికాసం క్రింద 4 వేల కోట్లతో 4 లక్షల మందికి చేయుతనిచ్చేందుకు ఋణాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రం అని, లంకె బిందెలు ఉంటాయి అనుకుంటే లంకె బిందెలలో నీళ్ళు తప్ప ఏమి లేవు అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి పోయిన బీఆర్‌ఎస్ పార్టీ మరలా పగటి కలలు కంటుందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలుచేసుకుంటూ వస్తున్నామని, రాష్ట్రా రాబడి మొత్తం అప్పులు కట్టడానికి సరిపోతుందని, అప్పులకు వడ్డీ కట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పయనించేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కృషిచేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రామచంద్రాపురం గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, ఈ గ్రామానికి సీతారామ ప్రాజెక్టు నీరు అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అలాగే గ్రామంలో ప్రతి ఒక్కరికి పట్టాదారు పాస్ పుస్తకం అందజేయాలని, అటవి, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా గ్రామంలో భూములు వివరాలు సేకరించి కలెక్టర్ ద్వారా పాస్ పుస్తకాలు అందజేయాలని ఆదేశించారు. రామచంద్రాపురం గ్రామంలో సమస్య అనే మాట రాకుండా మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ సభలో మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, షేక్ కరీముల్లా, చీకటి రామారావు, పంది వెంకటేశ్వరరావు, చీకటి చిన్న నరసింహారావు, రాజబోయిన కోటేశ్వరరావు, కీసర శ్రీని వాసరెడ్డి, బుక్యా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలు నేడు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ నాలుగు వరకు జరిగే పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 16,788 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షకు హాజరు కానుండగా వీరి కోసం 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16,417 మంది రెగ్యులర్ విద్యార్థులు, 371 మంది ప్రైవేటు, సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను అనుమతించనున్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. త్రాగునీరు, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, పోలీస్ సిబ్బందిని నియమించారు. 1,185 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. గతంలో జవాబు పత్రంగా ఒక జంట పేపర్ ఇచ్చేవారు. ఆ తర్వాత విద్యార్థులకు అదనపు జవాబు పత్రాలు (అడిషనల్స్) ఇచ్చేవారు. కానీ ఈసారి 24 పేపర్లతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు, ఇతర సమస్యల కోసం డిఈవో కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే 8331851510 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. పరీక్ష రాసే విద్యార్థుల కోసం ఆర్టిసి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది.

## ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**(మొదటిపేజీ తరువాయి)**

2024 25 రబీ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో ఖమ్మంజిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీ సీజన్‌కు సంబంధించి 1.85 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 78వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం మొత్తం 2.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబోతున్నామన్నారు. గత సీజన్‌లో ధాన్యం రవాణా అంశంలో ఎక్కడైనా చిన్న చిన్న ఇబ్బందులు వస్తే వాటిని పునరావృతం కాకుండా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రాధమిక అంచనా ప్రకారం ఏప్రిల్ రెండవ వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభమవుతాయని జిల్లాలో వరి పంట కోతల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకు వచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధృవీకరణ చేసి కొనుగోలు కేంద్రాల మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి మనకు సన్నరకం ధాన్యం రాకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్యాడి క్లినర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు మొదలగు వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు వేసవి దృష్ట్యా చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలిన పామాయిల్ తోటలను పరిశీలించిన అధికారులు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పామాయిల్ తోటలను అధికారులు పరిశీలించారు. రఘునాథపాలెం మండల పరిధిలోని బావోజీతండా గ్రామానికి చెందిన బానోత్ శివలాల్, బానోత్ పార్వతిలకు చెందిన పామాయిల్ తోటలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పలు చెట్లు కాలిపోయాయి. గురువారం కాలిపోయిన పామాయిల్ తోటలను ఉద్యాన వన శాఖాధికారి నగేష్, వ్యవసాయ శాఖ ఏడిఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏవో ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో శిరణ్మయి, రెవెన్యూ శాఖ ఆర్ఐ ప్రవీణ్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్ లు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన చెట్లను పరిశీలించారు. నష్టం అంచనాను ప్రాథమికంగా గుర్తించినట్లు నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలను పరిశీలిస్తున్నట్లు ఏఈ సతీష్ తెలిపారు. పామాయిల్ తోటలో ఉన్న ఎల్‌టి లైన్‌ను తొలగించాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను కోరామని అయిన పట్టించుకోలేదని రైతు శివలాల్ తెలిపారు. లైన్ మార్చకపోవడంతో ప్రమాదం వాటిల్లి చేతికొచ్చిన పంట కాలిపోయిందని రైతు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ లైన్‌ను మార్చాలని, అవసరమైన ఖర్చులు తాము భరిస్తామని రైతు శివలాల్ తెలిపారు. ప్రభుత్వం తరుపున కాలిపోయిన చెట్లకు నష్ట పరిహారం అందించాలని రైతులు శివలాల్, పార్వతి లు కోరారు.

# నిరుపేద విద్యార్థినికి పిఎస్ఆర్ ట్రస్టు చేయూత



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : నిరుపేద విద్యార్థినికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆర్థిక చేయూతనందించింది. రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలకకు చెందిన నిరుపేద విద్యార్థిని పెను గొండ సిరిచందన ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతుంది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఆర్థిక సాయం చేయాలని పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. ట్రస్టు నిర్వాహకులు పరిశ పుల్లయ్య వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి ట్రస్టు తరుపున రూ. 20వేల ఆర్థిక సాయాన్ని గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా విద్యార్థిని సిరిచందనకు అందజేశారు. ట్రస్టు చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయుడు పరిశ పుల్లయ్య చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు తెలుసుకుని అదనపు కలెక్టర్ అభినందించారు. ట్రస్టు చైర్మన్ పుల్లయ్య మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ట్రస్టు తరుపున సహాయ సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కోశాధికారి కనపర్తి వెంకటేశ్వర్లు, విద్యార్థిని తల్లి కవిత పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్రజాపక్షం/ మధిర : నేటి నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిమిత్తం మధిర పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలు, సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం నందు పరీక్షల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఓ వై.ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర టౌన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సిపిఎస్) నందు 180మంది, టివిఎం ఉన్నత పాఠశాల నందు 230మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 160మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 160మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురం నందు 257మంది మొత్తం మధిర మండలం నుండి 1049మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్లు, అలాగే పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరిండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్‌గా నియమించిన వారు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి 5నిమిషాల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని, ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ధరించి రాకూడదని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్స్‌తో సకాలంలో పరీక్షా కేంద్రాలకు వచ్చి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ సూచించారు.

# నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం : జారే



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాజీవ్ యువ వికాస్ పథకం కింద 5లక్షలమంది నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పనకు ఆర్థిక సహకారం అందనున్నదని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఈ నెల 17వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు మండల కార్యాలయం, ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని, ఏప్రిల్ 6వ తేదీ నుండి మే 30వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ మంజూరు ప్రక్రియ జరుగుతుందని, జూన్ 2వ తేదీన ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నేటి నుండి జరుగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని, విద్యార్థులందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ ఏకాగ్రతతో చదివి పరీక్షలు మంచిగా రాసి మంచి ఫలితాలుసాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు సకాలంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విధంగా ప్రతిఒక్కరూ సహాయ సహకారాలందించాలని కోరారు.

## 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు



ప్రజాపక్షం/మధిర : మధిర బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి పోటీ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెల్లూరి వెంకట్రావు తెలిపారు. మధిర బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, నామినేషన్ల దాఖలు అనంతరం అధ్యక్ష పదవికి బోజెడ్ల పుల్లారావు, పల్లపోతుల కృష్ణారావు మధ్య పోటీ ఉన్నందున 27న ఎన్నికలు అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. మిగిలిన నాలుగు స్థానాలకు ప్రధాన కార్యదర్శిగా జింకల రమేష్, ఉపాధ్యక్షులుగా గంధం శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా బైరవభట్ల రమణారావు,కోశాధికారిగా కాకాణి విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారని తెలిపారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు గురువారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర మండలంలోని దెందుకూరు, మధిర, రొంపిమళ్ల, నిధానపురం, అల్లీనగరం, సిరిపురం, మాటూరు గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.6లక్షల విలువైన చెక్కులను ఆయా బాధితులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థిక స్తోమత లేక ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన చెక్కులను అందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పాటిబండ్ల సత్యంబాబు, నిదమనూరు వంశీకృష్ణ, షేక్.జహంగీర్, సంపసాల రామకృష్ణ, ఇటికల కృష్ణారెడ్డి, గొల్లమందల శ్రీను, గుర్రాల వీరారెడ్డి, సూర్యదేవర హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీజ



ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలివేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ శ్రీజ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు శ్రీజ మాట్లాడుతు ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు వైరా మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతిరోజు ఈ చలివేంద్రాల వద్ద ప్రజలకు దాహం తీర్చే విధంగా చల్లటి నీరును అందించేందుకు సిబ్బందని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలు ఎండల తీవ్రతను బట్టి అవసరాలను బట్టి బయటకు రావాలని అనవసరంగా పనులు లేకుండా ఎండల్లో తిరగవద్దని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ చింతా వేణు, మున్సిపల్ ఆర్ఐ ప్రదీప్, ఆర్టీసి సిబ్బంది వెంకటేశ్వరరావు, రెడ్డి, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన మహాసభలు

ప్రజాపక్షం/వైరా : తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా 21వ మహాసభలు గురువారం వైరాలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలలనుండి మహాసభలకు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 15 తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. సంపూర్ణ రుణమాఫి, సీతారామప్రాజెక్టు సత్వర నిర్మాణం, ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు, కౌలుదారి చట్టం, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు తదితర తీర్మానాలను ఆమోదించారు. రెండేళ్ల కాలంలో రైతుసంఘం చేపట్టిన కార్యక్రమాలను తెలియజేస్తూ ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయగా జమ్ముల జితేందర్‌రెడ్డి ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు.

## బిసి బిల్లు ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిసి బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓబిసి ఖమ్మంజిల్లా అధ్యక్షులు, టిపిసిసి మెంబరు పుచ్చకాయల వీరభద్రం గురువారం కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని హామీ ఇచ్చిందని హామీకి అనుగుణంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదించడం హర్షణీయమన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చిన రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, బిసి ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ఖమ్మంజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కు ఈ సందర్భంగా పుచ్చకాయల వీరభద్రం కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

## ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఐదవ మహాసభలు ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తెలిపారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర విద్యా రంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, 10 యూనివర్సిటీల నుండి వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బడ్జెట్‌లో గతం కంటే 0.2 శాతం మాత్రమే పెంచారని ఉస్మానియా, కాకతీయ, జెఎన్‌టియుహెచ్ లాంటి యూనివర్సిటీలకు నిధులు లేవని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రస్తావించకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ప్రవీణ్, వినోద్, పూజిత, మనోజ్, త్రినాధ్, లోకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు బాగం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు తరుపున విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా ఖమ్మంజిల్లా విద్యా రంగంలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అందిస్తున్న ఆర్థిక చేయూత మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి, భయం లేకుండా పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి రాజ్యం, రమేష్ బాబు, వై. లక్ష్మి, ఎన్. నిర్మల, బాబుసాహెబ్, వి. ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర మండల పాస్టర్స్ ఐక్య ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో అల్లెలూయ ప్రార్థనా మందిరం నందు గురువారం ఎల్డర్ జి.దయాకర్ అధ్యక్షతన మధిర మండల పాస్టర్స్ ఐక్య ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గతంలో ఉన్న మూడు పాస్టర్స్ ఫెలోషిప్స్‌లో ఉన్న దైవ సేవకులు అందరూ సమావేశమై ఒకే ఫెలోషిప్‌గా ఏర్పడి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ డి.కరుణజోసఫ్‌జైకుమార్, ప్రధాన కార్యదర్శిగా బ్రదర్ టి.జాన్‌వెస్లీ, జాయింట్ సెక్రటరీగా బ్రదర్ యన్.జాషువా, ఉపాధ్యక్షులు పాస్టర్ ఎం.నతనీయులు, కోశాధికారిగా రూబిన్ సుధాకర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్, కోర్ కమిటీ పెద్దలుగా పలువురుని ఎన్నువటం జరిగింది. ఈ సమావేశంలో మధిర మండలంలో ఉన్న దైవ సేవకులు అందరూ పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండలానికి చెందిన 39 మందికి గురువారం రూ. 39,04,524/ లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎమ్మార్వో రాఘవ రెడ్డి, మణుగూరు ఎంపీడీవో శ్రీనివాసరావు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ నగర్ లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడి కేంద్ర ప్రారంభోత్సవానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన జ్యోతి జ్వాలను వెలిగించి అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండలం ఎమ్మార్వో రాఘవ రెడ్డి, మణుగూరు ఎంపీడీవో శ్రీనివాస రావు, ఎంఈఓ నాగజ్యోతి, సిడిపిఓ జయలక్ష్మి, ఐటిడిఏ డిఇ మధుకర్, ఏఈ ప్రసాద్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ కుహనా దేశక్తిని ఎండగడదాం

**ప్రజాపక్షం/కారేపల్లి:** దేశం కోసం నవ్వుతూ ఉరి కంభం ఎక్కిన కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94ల వర్ధంతి సభలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా జరపాలని పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ వి రాకేష్, పిడిఎస్‌యు జిల్లా స్టాలిన్‌లు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సభలు పోస్టల్‌లను గురువారం సింగరేణి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు రాము, వెంకటేష్, మహేష్, రాజు, వంశీ, లక్ష్మణ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సిపిఐ

**- పాల్వంచ ప్రాంత సమగ్రాభివృద్ధిపై ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక శ్రద్ధ**
**- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం / పాల్వంచ :** పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సీపీఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉల్వనూరు బంజర గ్రామ పంచాయితీ చిరతానిపాడుగుంపు సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ..నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ పటిష్ట కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులందరికీ పట్టాలు అందించి రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయితీలో సీపీఐకు ప్రాతినిత్యం వచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని 11 మందితో ఎనుకున్నారు. చిరతానిపాడుగుంపు శాఖ కార్యదర్శిగా మాడే చుక్కారావ్, సహాయ కార్యదర్శిగా సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, మండల నాయకులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, అమృతరావు, బాలాజీ, రేగు కృష్ణ, బాలు, స్వర్ణలత, రమణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** స్థానిక సాయి ఎక్సలెంట్ పాఠశాల నందు గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జూలూరుపాడు మండల స్థాయి పదవ తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రిటైర్డ్ సీఐ, చనుమోల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య వారు ప్రతి ఏటా టాలెంట్ టెస్ట్ లు నిర్వహించడం జరుగుతుందని ఈ ఏడాది కూడా పలు పాఠశాలల నుండి 250 మంది విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొనగా టాప్ 05 ఎంపిక చేయడం జరిగిందని అదేవిధంగా టాలెంట్ టెస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. టాలెంట్ టెస్ట్ లో సాయి ఎక్సెంట్ స్కూల్ నుండి ప్రథమ బహుమతి గాయత్రి, జూలూరుపాడు ప్రభుత్వ హైస్కూల్ నుండి నిశాంత్ ద్వితీయ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నుండి శృతి తృతీయ బహుమతి, టాప్ 5 బహుమతులను గెలుపొందారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల కోసం పోరాటం చేస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం నిజంగా అభినందనీయమన్నారు. సిపిఐ మండల కార్యదర్శి గుండే పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి విజయాలు సాధించి విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు, సాయి ఎక్సెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కరస్పాండెంట్, హుస్సేన్, ఆరబోయిన కృష్ణ ప్రసాద్ (కెపి) విద్యార్థి యువజన సంఘ నాయకులు, ఎస్‌కె. చాంద్ పాషా, పసుపులేటి పవన్, , చింటు, ఏఐటీయూసీ నాయకులు గుడిమెట్ల సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఏఐటియూసి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి పిఎస్‌పిడి పేపర్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏఐటియూసి అండగా ఉంటుందని ఏఐటియూసి ప్రధాన కార్యదర్శి సింగమనేని ప్రసాద్ అన్నారు. గురువారం కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉదయం ఎనిమిది గంటలకు కాగిత పరిశ్రమ ముందు ఏఐటియూసి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిసి పిఎస్‌పిడిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు యజమాన్యం శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదని, శ్రమ దోపిడి చేస్తుందని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచకుండా, కాలయాపన చేస్తూ కొంత మంది స్వార్థపు రాజకీయ నాయకులు అండతో కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. భవిష్యత్తులో కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉండి వారి న్యాయమైన కోరికల కొరకు దశల వారి ఉద్యమాలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలోనూతనంగా ఎన్నుకోబడిన కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు, అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదివాసి పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి పరిరక్షణ, మణుగూరు ఏరియా మనుగడ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, కాంటాక్ట్ కార్మికులకు వేతన పెంపు, ఆదివాసి పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం స్పందించేలా చూడాలని గురువారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావుకి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలకు వినతి పత్రాలు అందజేశారు. సింగరేణి పరిరక్షణ, మణుగూరు ఏరియా మనుగడ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, కాంటాక్ట్ కార్మికులకు వేతన పెంపు, ఆదివాసి పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం స్పందించేలా చూడాలనీ తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు నేపథ్యంలో సభలో చర్చించాలని పరిష్కార మార్గం చూపాలని కోరుతూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సిపిఐ కార్యాలయం ముఖ్దూమ్ భవన్ లో సిపిఐ కొత్తగూడెం శాసనసభ్యు లు శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావుకి, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎమ్మె ల్సీ ప్రొఫెసర్ కోదండరాంకి వినతి పత్రాలు అందజేసినట్లు గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్ డి నా సర్ పాషా విలేకరులకు తెలిపారు.

## సుపరిపాలనకు అద్దం పట్టేలా బడ్జెట్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆర్థిక శాఖ మంత్రి వర్యులు బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు అద్దం పట్టేలా ఉందని పినపాక నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లం కొండా వాసుదేవరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు వాగ్దానాలకు ప్రత్యేకంగా 56,084కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సాగునీటికి 23వేల కోట్లు, వ్యవసాయానికి 24వేల కోట్లు కేటాయించడం ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు ఎప్పుడు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని, రైతును రాజును చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆశయమని అన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు సంఘం జిల్లా మహాసభల దృశ్యమాలిక


















## ఎక్స్‌ప్రెస్ వే ల వివరాలు తెలపండి

**-పార్లమెంటులో ఎంపి రామసహాయం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రధాన మంత్రి గతి శక్తి పథకం క్రింద దేశంలో ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఎక్స్‌ప్రెస్ వే జాతీయ రహదారుల నిర్మాణం పురోగతి వివరాలు, ప్రాజెక్టుల వేగిరానికి చేపడుతున్న చర్యల గురించి తెలపాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖల మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. జాతీయ ఎక్స్‌ప్రెస్ వే లతో సహా జాతీయ రహదారు (ఎన్‌హెచ్)ల అభివృద్ధి, నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. యాక్సెస్ నియంత్రత హై స్పీడ్ కారిడార్లు (హెచ్‌ఎస్‌సి) సహా అన్ని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులు పిఎంగతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ (ఎన్‌ఎంపి) సూత్రాలకు అనుగుణంగా ప్రణాళికలు చేయబడ్డాయన్నారు. 2,474 కిలో మీటర్ల పొడవులో జాతీయ హెచ్‌ఎస్‌సిలు, ఎక్స్‌ప్రెస్ వే ల అమలు చేయబడ్డాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 779 కిలో మీటర్ల పొడువులో నాలుగు నేషనల్ హెచ్‌ఎస్‌సి ఎక్స్‌ప్రెస్ వే లు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. హైదరాబాద్ విశాఖపట్నం, సోలాపూర్ కర్నూల్ చెన్నై, ఇండోర్ హైదరాబాద్ మరియు నాగపూర్ విజయవాడ కారిడార్లకు సంబంధించి 415 కిలో మీటర్ల పొడవు నిర్మించబడినట్లు వివరించారు. ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి తెలిపారు.

## యువత భవిష్యత్తుకు కాంగ్రెస్ పెద్దపీట

**ప్రజాపక్షం / పాల్వంచ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత భవిష్యత్తు కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవీలాల్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత దశాబ్ద కాలంగా నిరుద్యోగ సమస్యతో ఎదుర్కొన్న యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే 65,000 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తయ్యిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు పంపిణీ చేయడం దేశ చరిత్రలోనే అపూర్వ ఘట్టమని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా నిరుద్యోగ యువతను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ‘‘రాజీవ్ యువ వికాస్’’ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుద్యోగులకు చేయూతనిచ్చేలా రూ.6వేల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. యువతకు మరిన్ని అవకాశాలను కల్పించనున్నాయని దేవీలాల్ నాయక్ వెల్లడించారు.

## గాజాలో హింసకు బాధ్యత అమెరికాదే..

**-గాజాపై ఇజ్రాయిల్ మారణకాండకు సిపిఎం ఖండన**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గాజాపై ఇజ్రాయిల్ మళ్లీ దాడులు చేయడంపై సిపిఎం ఖమ్మంజిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గురువారం దాడులకు నిరసనగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ నుండి ప్రదర్శన బయలుదేరి ఎన్నెస్పి క్యాంపులోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడుల వల్ల 413 మంది పాలస్తీనీయులు మరణించారన్నారు. అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయిల్ మరోమారు గాజాపై మారణకాండకు తెగబడిందని విమర్శించారు. రంజాన్ మాసంలో భీకర వైమానిక దాడులతో విరుచుకుపడి పాలస్తీనీయుల ప్రాణాలు హరించిందన్నారు. హమాస్ స్థావరాలే లక్ష్యంగా దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడుల్లో పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో మృతిచెందారన్నారు. గాజాలో హింసకు అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యతవహించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. 2023 నాటి నుంచి పాలస్తీనియుల మరణాల సంఖ్య 62వేలు దాటిందని వీరిలో అత్యధికులు సామాన్య అమాయక పౌరులేనన్నారు. తక్షణమే ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, నాయకులు నాగులమీరా, బోడపట్ల సుదర్శన్, ఆర్. ప్రకాష్, నర్రా రమేష్, ఎం. శ్రీను, చెరుకుపల్లి కుటుంబరావు, సదానందం, చింతల రమేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల ఐదు నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కాగా బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు, గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. చివరి రోజు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 16,476 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 16,033 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 443 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. జిల్లాలో 38 పరీక్షా కేంద్రాలను హెచ్‌పిసి, డిఈసి, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు ముగియడంతో హాస్టల్ ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీనితో బస్టాండ్లు విద్యార్థులతో కిటకిటలాడాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు లాగేజీని తీసుకెళ్లేందుకు వచ్చారు.

# నేటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈఓ జుంకీలాల్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** నేటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. మండల పరిధిలో రెండు సెంటర్లలో ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ బానోత్ జుంకిలాల్ తెలిపారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 347 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 304 మంది విద్యార్థులు, 43 మంది ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రజలకు హాజరవనున్నారు. వశిష్ట,సెయింట్ ఆంథోనీ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కలిపి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 170 మంది, సెయింట్ ఆంథోనీ స్కూల్లో 177 మంది పరీక్ష నిర్వహించనున్నారు. బాలికలు 206, బాలురు 141 లకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కొరకు వెలుతురు కొరకు లైట్లను, త్రాగేందుకు నీటిని, ఫ్యాన్లు ఇతర ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ విధించబడుతుందని ఎంఈఓ తెలిపారు. శుక్రవారం ఉదయం 9:30 గంటల నుండి,12:30 గంటల వరకు సమయం కేటాయించారు. దూర ప్రాంత విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని పరీక్షలు సజావుగా జరిగేందుకు సహకరించాలని సూచించారు. మార్చి 21 నుండి ఏప్రిల్ 2వ తేది వరకు పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. డిపార్ట్మెంటల్ ఆఫీసర్, సిట్టింగ్ కేర్, కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయని ఎంఈఓ జుంకిలాల్ తెలిపారు.

# కారుణ్య నియామక పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ జిఎం పర్సనల్, వెల్ఫేర్ ఛాంబర్ నందు కార్పొరేట్ ఏరియా లోని వివిధ డిపార్ట్మెంట్స్ నందు పని చేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకం కోసం జిఎం పిఎం వెల్ఫేర్ కవితా నాయుడు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భముగా కవితా నాయుడు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సిఎండి ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఆదేశాల మేరకు కారుణ్య నియామకంలో భాగముగా గొల్ల అపర్ణ, చిలక శ్రీకాంత్, పి.మురళి కృష్ణ నియామక పత్రాలు అందచేశారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం పొందటం చాలా అదృష్టం అని, నీతి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధత తో ఎల్లప్పుడు రక్షణ సూత్రాలు పాటిస్తూ, విధులకు గైర్హాజరు కాకుండా పై అధికారుల ఆదేశాలు అమలు చేస్తూ సంస్థ అభివృద్ధి కి పాటుపడాలని సూచించారు. విద్యా అర్హతల ప్రకారం అంతర్గతముగా కూడా చాలా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు మాట్లాడుతూ, నియామకములో భాగముగా ఉద్యోగం పొందినందుకు సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, ఐఆర్ఎస్, డైరక్టర్ పా కే.వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందచేసిన జిఎం పర్సనల్ ఐఆర్, పిఎం వెల్ఫేర్ కవితా నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రములో ఏజిఎం పర్సనల్ జి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ పితాంబర రావు, డివై.పిఎం బి.సుశీల్ కుమార్, మేనేజ్మెంట్ ట్రైనీ పర్సనల్ కే.ఉదయ్ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ కిరణ్, సింధు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలి




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** భగత్ సింగ్ 94వ వర్ధంతిని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పార్టీ జిల్లా కార్యాలయం వద్ద భగత్ సింగ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పివైఎల్ మాజీ జిల్లా నాయకులు భానోతు ధర్మ, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి పెద్ద బోయిన సతీష్ లు మాట్లాడుతూ, నిజమైన స్వతంత్రం కోసం ఉద్యమించి తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుకు దేవుల స్ఫూర్తితో పోరాడాలని వారు పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వతంత్రం కోసం యుక్త వయసులో ఉన్న భగత్ సింగ్ లాంటి వారు అనేక మంది విప్లవ వీరులు ఉరికంబానికెక్కడం జరిగిందని అన్నారు. తెల్ల దొరలు వెళ్లి నల్ల దొరలు గద్దెనెక్కే బూటకపు స్వతంత్రం వద్దు అంటూ గర్జించి సామ్యవాద, సోషలిస్టు దేశం కావాలంటూ నినదించిన మహా గొప్ప వీరులని అన్నారు. కులం, మతం వద్దు అంటూ అందరూ సమానమే అంటూ సమ సమాజం కోసం కలలుగన్న మహా గొప్ప వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. నేడు దేశంలో మత కల్లోలాలు సృష్టిస్తూ దేశాన్ని రక్తపాతం లోకి కేంద్ర ప్రభుత్వం నెట్టుతుందని ఆరోపించారు. హిందూ ముస్లిం క్రిస్టియన్ల మధ్యన విభేదాలు సృష్టించి గొడవలు సృష్టించి తమ స్వార్థం కోసం యువతను పక్కదారి పట్టించడం జరుగుతుందని అన్నారు. దేవుని పేరుతో రాజకీయం చేస్తూ ఆదాని, అంబానీ లాంటి వాళ్లకు వేలకోట్ల రూపాలు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా యువత, విద్యార్థులు ఆలోచించి కుల, మత, దోపిడి లేని నవ సమాజాన్ని నిర్మించుకునే బాధ్యత తమ పై ఉందని కోరారు. దేశంలో రాష్ట్రంలో యువత చెడు అలవాట్లకు డ్రగ్స్ మాఫియాకు మత్తుకు బానిసలు కాకూడదని ఈ దేశానికి యువతే రేపటి పౌరులని ఆ వైపుగా యువత ముందుండి నడవాలని ఈ సందర్భంగా కోరారు. ఏం రాజశేఖర్, చంటి, బుద్రి, సారన్న, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదే విధంగా సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఆయన పరీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాలలో 135 మంది, స్థానిక సెంట్ జోసఫ్ పాఠశాలలో 140 మంది పదో తగరతి విద్యార్థులు శుక్రవారం నుండి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేలా అందరు సహకరించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో గల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం చీఫ్ సూపర్ ఇంటెండెంట్ లు, డిపార్ట్మెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పరీక్ష నిర్వహణ విధానాల గూర్చి నియమాలను స్పష్టం చేశారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ విషయంలో బహు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరు సెల్ ఫోన్‌లు ఉపయోగించకూడదని, పరీక్ష విధులకు సంబంధం లేని ఎవరినైనా కేంద్రంలోనికి అనుమతించవద్దని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ లకు తావు ఇవ్వకుండా విద్యార్థులు తమ తమ సామర్థ్యాల మేరకు ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సకల పరీక్షల సిబ్బందిని కోరారు. మండల పరిధిలో 738 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అందరూ ధైర్యంతో, నిబ్బరంగా, నిజాయితీగా పరీక్షలను రాయాలని కోరారు.

## నూతన బిజెపి జిల్లా అధ్యక్షునికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నెల్లూరు కోటేశ్వరరావును తల్లాడ మండల బిజెపి అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం కోటేశ్వరరావును వారి స్వగృహం నందు కలిసి పూలమొక్కను అందించి శాలువాతో సత్కరించారు. ఇటీవల బిజెపి అధిష్ఠానం ప్రకటించిన నూతన జిల్లా అధ్యక్షుడు జాబితాలో ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా నెల్లూరు కోటేశ్వరరావు, తల్లాడ మండల అధ్యక్షునిగా చల్లా నాగులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ చల్లా నాగులు ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసి పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మండల అధ్యక్షులు నాగులు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన నెల్లూరు కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, ఉపాధ్యక్షులు సంగీతం సాయిచంద్, జిల్లా నాయకులు రాయల రమేష్, కిసాన్‌మోర్చా అధ్యక్షులు చౌడ నాగేశ్వరరావు, చల్లా నర్సింహారావు, కటిక నర్సింహారావు, ఉదయ్, గురునాథం, రామకృష్ణ, గొల్లమందల నరేష్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని జిపి కార్మికుల వినతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తమ న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు గురువారం స్థానిక ఎంపిడిఓకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, పంచాయతీ కార్మికుడు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీసం వేతనాలు అందించాలని తదితర న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఇమ్మడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లాజరు, వెంకటేశ్వర్లు, కృష్ణ, దాసు, రవి, నారాయణ, వీరాంజనేయులు, మురళీ, ప్రభాకర్, బుజ్జి, రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నేటి నుండి జరగనున్న పది పరీక్షకు పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈవో యెదు సింహారాజు అన్నారు. గురువారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 665 మంది రెగ్యులర్ విద్యార్థిని, విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. వీరి కోసం జిహెచ్‌ఎస్ బూర్గంపాడు, జెడ్‌పిహెచ్‌ఎస్ గర్ల్స్ బూర్గంపాడు, టిఎస్‌ఆర్ఎస్ గర్ల్స్ బూర్గంపాడు, ఏహెచ్‌ఎస్ ఉప్పుసాక ఈ నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష నిర్వహణ కోసం ఇన్విజిలేటర్, సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, పేపర్ కస్టోడియంలు కలిసి 40 మంది ఉంటారని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవడం మంచిదన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ తప్పని సరిగా పరీక్ష కేంద్రానికి తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లో, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని, పరీక్షా కేంద్రాల దగ్గరలోని జీరాక్స్ సెంటర్ల మూసివేత, 144వ సెక్షన్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థిని, విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 30 మంది మావోయిస్టులు హతం

**-ఎదురుకాల్పుల్లో డిఆర్‌జి జవాన్ మృతి**
**-బలగాలకు అమీత్ షా కితాబు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి రక్తసిక్తమైంది. ఆ రాష్ట్రంలో గల బస్తార్ ప్రాంతంలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఘటనను ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు నిర్ధారించారు. బిజాపూర్ జిల్లాలో 26 మంది మావోయిస్టులు హతం కాగా, కాంకేర్‌లో సంయుక్తగా జరిపిన కాల్పుల్లో మరో నాలుగురు మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. ఇదిలా ఉండగా బిజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో డిఆర్‌జి జవాన్ ఒకరు మృతి చెందారు. బీజాపూర్ దంతెవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున కూంబింగ్ ప్రారంభించారు. జిల్లాలోని గంగలూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలంటూ ముందుగా భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మావోయిస్టులు కాల్పులకు దిగారని, భద్రతా బలగాలు ఆత్మరక్షణలో భాగంగా ఎదురుకాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో 26 మంది మావోయిస్టులు హతమయ్యారని, ఘటనా స్థలం నుండి మావోయిస్టుల మృత దేహాలతో పాటు తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాదీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ కాల్పుల్లో డిఆర్‌జి జవాన్ కూడా మృతి చెందినట్లు ప్రకటించారు. మరో ప్రక్క కాంకేర్ నారాయణపూర్ జిల్లా అటవీ సరిహద్దుల్లోని మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. డిఆర్‌జి, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) సంయుక్త బృంధాలు కూంబిగ్ నిర్వహిస్తున్న క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య హోరాహోరీ సుమారు 4 గం. పాటు కాల్పులు చోటు చేసుకున్నారు. జవాన్ల తుటాలధాటికి తాళలేని మావోయిస్టులు అడవుల్లోనికి జారుకోగా ఘటనాస్థలంలో పరిశీలించడంతో నాలుగు మావోయిస్టు మృతదేహాలు లభ్యమైనట్లు కాంకేర్ పోలీస్ సూపరింటెండెంట్ కళ్యాణ్ ఎలెసేలా వెల్లడించారు. ఈ ఘటనలో మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆటోమెటిక్ తుపాకాలు కూడా స్వాదీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్న ప్రాంతాల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న పోలీస్ అధికారులు తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటి వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మొత్తం 113 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో 97 మంది బీజాపూర్, కాంకేర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లోనే హతమార్చారు. ఈ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమీత్‌షా స్పందిస్తూ దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడంలో భద్రతా బలగాలు మరో పెద్ద విజయాన్ని సాధించాయంటూ ప్రశంసలు కురిపించారు. మోది ప్రభుత్వం మావోయిస్టులు లేకుండా చేసేందుకు పెద్ద ఎత్తున ముందుకు సాగుతోందని అన్నారు. సంఘ విద్రోహతశక్తులను, దేశానికి నష్టం చేసేవారిని, అభివృద్ధిని అడ్డుకునే వారిని వదిలేది లేదని, ఇందు కోసం ఖఠినమైన విధానాలు అవలంభిస్తామని, వచ్చే ఏడాది మార్చి చివరు వరకు దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చి చూపిస్తామని అమీత్ షా ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

# నేటి నుండి పదో తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** పదో తరగతి పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ఏర్పాట్లను ఆధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12282 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నేటి నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 4వ తేది వరకు జరుగుతాయి. ఉదయం 9.30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కానుండగా 12.30 గం.లకు ముగియనుంది. విద్యార్థులను ఉదయం 8.30 గం. నుండే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించనుండగా ఐదు నిమషాల పాటు ఆలస్యంగా వచ్చినప్పటికీ పరీక్షకు అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఐదుగురు ఫ్లైయింగ్ స్కాడ్‌లు, ఏడుగురురూట్ ఆఫీసర్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 26 మది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్కాడ్‌లు వీధులు నిర్వహించనున్నారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాలు పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో పెట్టారు. సమీప ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసిబస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో మంచి నీటి సదుపాయంతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని సదుపాయాలు కల్పిచామని, పరీక్ష కేంద్రాల్లో వెలుతురు గాలి ఉండేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**కలెక్టర్ శుభాకాంక్షలు...**



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రతీ విద్యార్థికి మైలురాయి అని, ఈ మైలురాయిని దాటిన ప్రతీ ఒక్కరూ జీవితంలో చక్కటి స్థానాలు చేరుకుంటారని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాసి చక్కటి ఫలితాలు తీసుకొచ్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఆయన కాంక్షించారు.

# ప్రాణపాయ స్థితిలో ప్రైవేట్ విద్యుత్ కార్మికుడు

**-మాకు తెలియదంటున్న విద్యుత్ శాఖ అధికారులు**
**-రైతుపై నెపం మోపుతున్న వైనం**
**-ఆ కుటుంబానికి దిక్కెవరు..?**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బతుకు తెరువు కోసం ప్రైవేట్ విద్యుత్ కార్మికుడిగా విద్యుత్ శాఖ అధికారుల వద్ద పని చేస్తున్న మూడ్ రాందాసు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు, అయితే అధికారులు మాత్రం తమకేమి తెలియదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అప్పటి వరకు అతనితో పనులు చేయించుకున్న లైన్ మెన్, అసిస్టెంట్ లైన్ మెన్ లు ప్రమాదం జరగ్గానే తమకు తెలియదని, అతను స్వంత పని నిమిత్తం వెళ్ళాడని చెప్పి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. వివరాల్లోకెళ్లితే.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం, ఎర్రగుంటపాడు గ్రామానికి చెందిన గాదే సత్యనారాయణ రెడ్డి అనే రైతు వ్యవసాయ భూమిలో ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ అధికారులకు తెలుపగా, రాందాస్‌ను మరమ్మత్తులు చేసేందుకు పంపారని, పనులు చేస్తుండగా రాందాస్ విద్యుత్ ఘాతానికి గురయై కిందపడిపోవటంతో తక్షణమే రైతు విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు చరవాణి ద్వారా సమాచారం అందించి, హుటా హుటిన సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ బాధితుడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం తక్షణమే ఖమ్మం తరలించాలని తెలపడంతో 108 సాయంతో రాందాస్ ను ఖమ్మం తరలించారు. ఈ సంఘటనపై లైన్మెన్, జూనియర్ లైన్మెన్ లను వివరణ కోరగా తమకు అసలు విషయం తెలియదని, తమకు తెలియకుండానే అతను రైతు వద్ద పనికి వెళ్ళాడని, మాకు సంబంధం లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. కొసమెరుపేమిటంటే జూనియర్ లైన్మెన్ రాజేష్, రాందాస్ కుటుంబ సభ్యులను కారులో తీసుకొని ఖమ్మం వెళ్లడం గమనార్హం. మంచిగా ఉన్నప్పుడు పనులు చేపించుకొని, కష్టాల్లో ఉన్నప్పుడు వదిలివేయడం విద్యుత్ శాఖ సిబ్బందికే చెల్లిందని గ్రామంలోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తమకు విద్యుత్ శాఖ సిబ్బంది అంటే రాందాస్ మాత్రమే తెలుసని, తమకు లైన్మెన్, అసిస్టెంట్ లైన్మెన్ ఎవరో కూడా సరిగ్గా తెలియదని ప్రజలు చెప్తున్నారు. రాందాస్‌కు జరగరానిది జరిగితే విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఈ ఘటనకి పూర్తి బాద్యత విద్యుత్ శాఖాధికారులదేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై వేంసూరు విద్యుత్ శాఖ ఏఈఈ ను వివరణ కోరెందుకు చరవాణిలో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఈ సంఘటనపై సత్తుపల్లి ఏడి ఈఈని వివరణ కోరగా విద్యుత్ శాఖలో ప్రైవేట్ సిబ్బంది ఉండరని, ఈ సంఘటన నా దృష్టికి రాలేదని లైన్మెన్, అసిస్టెంట్ లైన్మెన్ విద్యుత్ ఘాతానికి గురైన వ్యక్తితో సంభాషించినట్లు రజువైతే వారిరువురుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# నేడు ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మంజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న ఇఫ్తార్ విందును నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. బిక్కు, కె. వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయం ఇందిరా నగర్ ఖమ్మం నందు ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఖమ్మంలో అన్ని శాఖల్లో పని చేయుచున్న నాల్గవ తరగతి ఉద్యోగులు నగర, జిల్లాశాఖ, డిపార్టుమెంట్ యూనిట్ కార్యవర్గ సభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# అశ్రునయనాలతో ప్రసాద్ అంతిమ వీడ్కోలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇటీవల బోరింగ్ తండా వద్ద రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ తాజా, మాజీ ఎంపీపీ, కోరం కనకయ్య వీరాభిమాని ఉండేటి ప్రసాద్ అంతిమయాత్రలో నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గత ముప్పై ఏళ్లుగా కోరం కుటుంబసభ్యులతో మృతునికి గత అవినాభావ సంబంధాన్ని గుర్తుచేసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ధరయ్యారు మండలం సులానగర్ గ్రామంలో నిర్వహించిన మాజీ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ అంతిమయాత్రకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరాగా నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య తానే స్వయంగా పాడె మోసి నివాళులర్పించారు.

# విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/పినపాకః** పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాని తహశీల్దార్ అద్దంకి నరేష్ ఆదేశించారు. గురువారం పదవ తరగతి పరీక్షలు నిర్వహించే పినపాక మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఐలాపురంలో గల ఎజీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలీస్ అధికారులు పరీక్షల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష హాల్‌కు ఉదయం 8.30 గంటల వరకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. ప్రశ్నాపత్రం ఇవ్వగానే ఆసాంతం చదవాలని, మొదట సులభంగా ఉన్న ప్రశ్నలకు జవాబులు రాయాలని విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం అన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, వైద్యం, ఫర్నిచర్ సౌకర్యాలు కల్పించాం అని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గణేష్, సర్వేయర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరికొత్త సైబర్ క్రైం

**మున్సిపల్ కమీషనర్ నంటూ ట్రేడ్ లైసెన్స్ పేరుతో వ్యాపారులకు కుచ్చు టోపి**

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ఇటీవల కాలంలో ప్రతి ఫోన్ కాల్ కు ముందు సైబర్ నేరగాళ్ళ గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నా, సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాలపై తెలివిగా బురిడి కొట్టిస్తూ డబ్బులు కొల్లగొడుతున్నారు. బుధవారం సత్తుపల్లిలో జరిగన ఓ ఘటన అందిరిని విస్తు పోయేలా చేసింది.ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ పేరు చెప్పి మున్సిపల్ కమీషనర్ నంటూ వ్యాపారులను బాగానే బురిడీ కొట్టించాడు ఈ మాహా మాయగాడు.వివరాల్లోకెళ్ళితే ఓ అజ్ఞాత వ్యక్తి కొందరు వ్యాపారులకు వాట్సప్ కాల్ చేసి నేను సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ ని మాట్లాడుతున్నాను మీ షాపు యొక్క ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యలేదని, తక్షణమే డబ్బులు కట్టక పోతే మీకు ఫెనాల్టీ పడుతుందని, ఇప్పుడైతే రూ. 2100 కడితే అయిపోతుందని, లేదంటే సుమారు రూ. 15 వేలు కట్టాలని బెదిరించి డబ్బులు ఫోన్ పే ద్వారా వసూలు చేశాడు. ఇతను ఉపయోగించిన ఫోన్ నంబర్ 9911468329, 7670906441, 7989272438 ఈ నెంబర్ల ద్వారా వాట్సప్ ఫోన్లు చేస్తూ తెలివిగా బురిడి కొట్టించాడు.ఈ విషయంపై సదరు మున్సిపల్ కమీషనర్ ను వివరణ కోరగా తమకు సంబందం లేదని , వ్యాపారులు, ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని..ఎవరికి డబ్బులు పంపవద్దన్నారు..అనుమానం వస్తే పోలీసుల వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.సత్తుపల్లి మునిసిపాలిటి నుండి వార్డ్ ఆఫీసర్ స్వయం గా మీ షాపు వద్దకు వచ్చి ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేస్తారని,లేదా మీరు మునిసిపల్ కార్యాలయానికి వచ్చి ట్రేడ్ రెన్యువల్ చేయించి తగు రశీదు పొందాలని సత్తుపల్లి మున్సిపాలిటీ కమీషనర్ సూచించారు.

# భగత్‌సింగ్ లౌకిక సందేశ్ యాత్రను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఇల్లందు:** భగత్‌సింగ్ లౌకిక సందేశ్ యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఏజే రమేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. భగత్‌సింగ్, సుకదేవ్, రాజ్‌గురుల వర్ధంతులు ఈనెల23న వారు నిర్వహించిన విప్లవ పోరాట స్ఫూర్తిని, బ్రిటీష్ సామ్రాజ్యంపై దేశ స్వాతంత్రం కోసం నిర్వహించిన పోరాట గాథలతో ఈనెల 23వరకు సీపీఎం ఆధ్వర్యంలో వాడవాడలా, గ్రామ గ్రామాన భగత్‌సింగ్ లౌకిక సందేశ్ యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ భాజపా ప్రభుత్వం మతసామరస్యాన్ని దెబ్బతీసి సృష్టిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో లౌకిక భావాన్ని నింపే విధంగా సీపీఎం ఆధ్వర్యంలో యాత్రను నిర్వహిస్తున్నామని, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని వ్యాపార రంగంలో ముందుకు సాగేందుకు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొందుతున్న మహిళలకు ఏ ఏ వ్యాపారాలలో అభివృద్ధి చెందుతారో ఆ విధంగా తగిన సూచనలు చేయాలని, రుణాలు పొందడంతో పాటు తిరిగి చెల్లించే విధంగా మహిళలకు తెలపాలని కలెక్టర్ అన్నారు. మహిళలకు తమకు చేతనైన అర్థమయ్యే వ్యాపారాలను గుర్తించి మహిళలకు వ్యాపార రంగంలో ఉత్పత్తులు క్రయవిక్రయాలు వంటి మెలకువలను ఐకెపి సిబ్బంది తెలపాలని సూచించారు. ఐకెపి సిబ్బంది పొదుపు




సంఘాలకు రుణాలు ఇప్పించి చేతులు దులుపుకోవడం కాదని వ్యాపార రంగంలో మహిళలు అభివృద్ధి చెందేలా తగిన తోడ్పాటును సూచనలను అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఎ ఏపీడి నజీరుద్దీన్, తహశీల్దార్ ప్రతాప్, ఐకెపి ఎపిఎం జ్యోతి ప్రసన్న, ఎంపీడీవో అన్నపూర్ణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు వంగ వెంకట్ పాల్గొని మాట్లాడుతూ, పివి ఓసి, జివిఆర్ ఓసి 3 ప్రైవేటీకరణ చేయాలనుకునే కేంద్ర ప్రభుత్వం ఆలోచన సరైనది కాదని, కార్మికుల బాగోగులు చూడవలసిన యాజమాన్యం కార్పొరేట్ బడా బాబుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, కార్మికుల హక్కులను కాలరాయాలని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతిని కార్మిక లోకం ఒకటై తిప్పి కొట్టాలని ఆయన అన్నారు. అదే విధంగా సీఎంఓ, సిఎస్ఓ పోస్టులను అవుట్సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలనుకోవడం విరమించుకోవాలని అన్నారు. ప్రజల పాలన అంటూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడానికి కార్మికులు కూడా ముఖ్యపాత్ర పోషించారని, వారికి రావాల్సిన 35 వేల కోట్లు సింగరేణికి తక్షణమే విడుదల చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వట్టి కొండ మల్లికా



ర్జున్, వీరస్వామి, రమణమూర్తి, సముద్రాల సుధాకర్, గట్టయ్య, రాములు, మధు, ప్రసాద్, శ్రీనివాస్, నరసింహారావు, కిషోర్, భరణి,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఖయ్యూం, రసూల్ రణధీర్, వినయ్, అజిత్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 4 పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల 151 విద్యార్థులు, జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ 167 మంది విద్యార్థులు, తెలంగాణ గురుకుల బాలికలు 190 మంది విద్యార్థులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మొత్తం 708 మంది విద్యార్థులతో పై నాలుగు సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి సెంటర్కి ఒక చీప్ సూపరిండెంట్ , డిపార్ట్మెంట్ ఆఫీసర్ విద్యార్థులకు అనుగుణంగా ఇన్విజిలేటర్లు ఏర్పాటు చేసి ఈ రోజు అందరికి కూడా పరీక్షలు నిర్వహణై తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే ఎమ్మార్వోకి, ఎస్సైకి, ఆరోగ్యశాఖ వారికి వైరా మున్సిపాల్ కమీషనర్కి, పోస్టల్ శాఖకు తగు సమాచారాన్ని ఇవ్వడం జరిగింది. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించినటువంటి సూచనలను తెలియజేయడం జరిగింది. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించుకోవడం జరుగుతుంది. కాబట్టి విద్యార్థులందరూ కూడా సమయానికి హాజరై వారికి ఎలాంటి చేసినటువంటి సెంటర్ నందు ఏ రూములోనైతే నెంబర్ అలాట్



చేశారు. అక్కడే కూర్చొని పరీక్ష వ్రాయాల్సి ఉంటుంది. కాబట్టి విద్యార్థులందరూ కూడా తప్పకుండా ఎటువంటి అనుమానాలు తావులేకుండా మంచిగా పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులు కావాల్సిందిగా కోరుతున్నాం. అలాగే తల్లిదండ్రులు కూడా తమ తమ పిల్లలకు పరీక్ష సెంటర్ దగ్గరికి సమయానికి అనుగుణంగా పంపించి పరీక్షలు వ్రాయించుకోవాల్సిందిగా కోరుతున్నాం. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల ప్రకారం అన్ని ఎటువంటి అవకతవకలకు అనుమానాలకు తావు లేకుండా పూర్తి ఏర్పాట్లను పూర్తి చేసుకోవడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు.

# డివిజన్లలో పర్యటించిన కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. గురువారం కార్పోరేషన్ పరిధిలోని 46వ డివిజన్లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. డివిజన్లో కాలువల శుభ్రతను పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. డివిజన్లో కార్పొరేటర్తో కలిసి పలు కాలువలను పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా నిర్మించాల్సిన కాలువలు ప్రణాళిక ప్రకారంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కొత్త కాలువలు నిర్మించేటప్పుడు నీరు సులభంగా పారేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. డివిజన్లోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎనిమిదవ డివిజన్లో కమిషనర్ పర్యటించి అక్కడ వాక్వేను సందర్శించారు. మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాక్వే పనిచేసే సమయాన్ని, మొక్కలకు నీరు పెట్టే సమయాన్ని



సూపర్వైజర్ను అడిగి తెలుసుకున్నారు. వాక్వేలో పాడైన లైట్లను తక్షణమే రిపేర్ చేయించడంతో పాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశవాణి కొత్తగూడెం యువ వాణి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ హిందీ విభాగం విద్యార్థులు ఆకాశవాణి కొత్తగూడెం యువ వాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్కె రేష్మ థర్డ్ బీకాం మహిళల హక్కులు, చట్టాలు అనే అంశంపై మాట్లాడుతూ.. మహిళల హక్కులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సమాజంలో




లింగ సమానత్వాన్ని కాపాడవచ్చునని, మహిళలు తమ హక్కులను తెలుసుకోవడం ద్వారా శక్తివంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చునని తెలియజేశారు. అనంతరం ఎస్ లావణ్య థర్డ్ బిజెడ్సి హిందీ మహిళా సాహిత్యకారులు అనే అంశంపై మాట్లాడుతూ..మహిళా రచయితలు సమాజంలోని మహిళల వివిధ సమస్యలను, జీవితాలను, భావోద్వేగాలను తమ రచనల ద్వారా తెలియజేసి మహిళలను చైతన్యవంతులను చేసినారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన హిందీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.అరుణకుమారి, సహనాజ్లను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.పద్మ, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

# వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం, రంగం బంజర్ గ్రామంలో సీనియర్ నాయకులు సోమరాజు సీతారామరాజు కుమార్తె వివాహం ఇటీవల కాగా నూతన దంపతులను గురువారం తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మరియు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ



కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఎఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, 5 మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ఎస్యూఐ మహిళా కాంగ్రెస్ నాయకులు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ నాయకులు, రామచంద్రపురం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** నేటి నుండి జరుగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా లక్ష్యంతో చదివి పరీక్షలు రాయాలని మీనవోలు శ్రీ భాస్కర పాఠశాల కరస్పాండెంట్ బి.సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం



పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఒకటి నుండి పదవ తరగతి చదివే విద్యార్థులు ఇంటికి పునాదులు వంటి వారని, అలాంటి పునాదులు దృఢంగా ఉన్నప్పుడే ఇల్లు కూడా దృఢంగా ఉంటుందని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించి సమర్థవంతంగా పరీక్షలు రాసేలా సంసిద్ధులు కావాలన్నారు. ఎటువంటి ఆందోళన చెందకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలని, తమ తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీలను గురువారం ఖమ్మం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ కె.వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో లెక్కించారు. 91రోజులకు గాను 32లక్షల86వేల315 రూపాయల ఆదాయం వచ్చినట్లు ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కొత్తూరు జగన్మోహన్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస్శర్మ, అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, అర్చకులు, సిబ్బంది, మధిర శ్రీ సత్యసాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# అణగారిన వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీ, బిసి, బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేలా ఈ బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు ఆరు గ్యారెంటీల ఊసే లేదని లకావత్ గిరిబాబు మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఇచ్చిన దళిత బంధుకు బదులుగా కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద 12 లక్షలు ఇస్తామన్నారు.. కానీ ఎలాంటి ఊసే లేదు.. అంటే దళిత బంధుకు రాం రాం చెప్పేసినట్లేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దళితులను నమ్మించి వెన్నుపోటు పొడిచే పార్టీ అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రస్తావనే లేదన్నారు. నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని మోసం చేసిన బడ్జెట్ ఇది. గత పదేండ్ల ప్రగతి కి గండి పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం అని, రేవంత్ రెడ్డి చేతకాని పాలనకు నిలువుటద్దం ఈ బడ్జెట్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం, మహాలక్ష్మి , పెన్షన్ల లకు దిక్కు లేదన్నారు. అంతే కాకుండా ఈ ప్రభుత్వం యాదవ సోదరులకు గొర్రెలు ఇస్తామని నమ్మబలికి వారి ప్రస్తావనే లేదు. ఆ పథకం ఊసే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాల్లో 80 మందికి పైచిలుకు పిల్లలు చనిపోతే ఆపలేని వీళ్ళు కొత్త స్కూల్స్ ను నిర్మిస్తాం అనడం విడ్డూరంగా ఉందన్నారు